

నారాయణపేట జిల్లాలో మహబూబ్‌నగర్ నుంచి రాయచూరు (కర్నాటక) వెళ్లే రహదారికి సమీపంలో ముడుమాల్ గ్రామం ఉంది. ఈ ఊరిలో కృష్ణానదికి దగ్గర్లో (కిలోమీటరు దూరంలో) ఆదిమానవుల ఖగోళ పరిశోధనల ఆనవాళ్లు, వాళ్లు నిలిపిన నిలువురాళ్లు, నిర్మించిన సమాధులు ఉన్నాయి.



### క్రీ.పూ.3000 సంవత్సరాలకు ముందు

కృష్ణానది సముద్రంలో కలవడానికి మరో 870 మైళ్ల దూరం ఉన్న ప్రాంతం. ఆ నదిని ఆసరా చేసుకుని ఆదిమానవులు పోడు వ్యవసాయం మొదలుపెట్టారు. పంట సాగులో విత్తనాలు ఎద పెట్టడానికి అనువైన కాలం తెలుసుకునేందుకు సూర్యుడి గమనంపై దృష్టి సారించారు. ఆకాశానికి నిలువురాళ్లను ఎక్కుపెట్టారు. నీడల జాడలతో సూర్యగమనాన్ని ఒడిసిపట్టి ఉత్తరాయణ, దక్షిణాయన కాలాల్ని లెక్కగట్టారు. రోజులో పగటి, రాత్రి ప్రమాణాలను తెలుసుకుని ప్రయాణాలు మొదలుపెట్టారు. వేట ముగిశాక తిరిగి ఆవాసాలకు చేరుకుంటున్న సందర్భంలో వాళ్లు ప్రయాణించే దారికీ, నక్షత్రాలకూ ఏదో సంబంధం ఉందని గుర్తించారు. తర్వాతి తరాలు దారితప్పకుండా ఉండేందుకు ఆ దిక్కులే దిక్కని చెప్పేందుకు రాళ్లపై నక్షత్ర మండలాల్ని చిత్రించారు.

### క్రీ.శ.1942

రోజులు... సంవత్సరాలు.. శతాబ్దాలు.. యుగాలు గడిచిపోయాయి. కానీ, అంతరిక్షాన్ని శోధించిన ఆదిమానవుడు రాళ్లపై చిత్రించిన ఖగోళ విన్యాసాలు మాత్రం చెరిగిపోలేదు. ఆ రాతి ఆనవాళ్లు 1942లో భూభౌతిక పరిశోధకుడు కృష్ణమూర్తి కంటపడ్డాయి. హైదరాబాద్ దక్కన్‌లోని ముడుమాల్, మురహరిదొడ్డి గ్రామాల సమీపంలో ఆదిమానవుల సమాధులు, నిలువురాళ్లు ఉన్నట్టుగా ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ దక్కన్ జియాలజీ డిపార్ట్‌మెంట్ తరఫున జరిగిన సర్వేలో మొట్టమొదటిసారిగా వీటిని గుర్తించారు. ఈ ప్రాంతానికి దగ్గర్లో ఉన్న గోపాల్‌పూర్‌లో కూడా ప్రాచీన మానవుడి ఆనవాళ్లు ఉన్నాయని తన సర్వే నివేదికలో ప్రస్తావించారు. ఆయన పురావస్తు శాస్త్రవేత్త కాకపోవడం వల్ల దీని గురించిన విశేషాలేవీ నిజాం కాలంలో బయటికి రాలేదు.

### క్రీ.శ.1956

సుప్రసిద్ధ పురావస్తు పరిశోధకుడు ఎఫ్.ఆర్.ఆల్చిన్ 1956లో మురహరిదొడ్డి, గుడెబల్లూరు గ్రామాలకు సమీపంలోని నిలువురాళ్లు, సిస్టులు (రాతి సమాధులు) పరిశీలించాడు. ఇక్కడ ఆరు వరుసల్లో నిలువురాళ్లు ఉన్నాయని, ప్రతి వరుసలో ఆరు చొప్పున ఉన్నాయని తన నివేదికలో తెలిపాడు. ఆయన లెక్క ప్రకారం ముడుమాల్‌లో 36 నిలువురాళ్లు ఉండాలి. కానీ, అంతకంటే ఎక్కువగా మొత్తం 80 దాకా పురావస్తు పరిశోధకులు గుర్తించారు. 1956లో ఆల్చిన్ నివేదిక తర్వాత ముడుమాల్ నిలువురాళ్ల పరిశోధనల్లో పురోగతి లేదు.

ముడుమాల్ గ్రామం, కృష్ణానది సమీపంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఆదిమానవుల ఆనవాళ్లు ఉన్నాయి. ఇవి బృహత్‌శిలా (మెగాలిథిక్) యుగానికి సంబంధించినవి. వీటిలో స్టోన్ సర్కిల్స్ (రాతి సమాధులు) ఉన్నాయి. పెద్ద పెద్ద బండలను వలయాకారంలో అమర్చి, వాటి మధ్య చనిపోయినవాళ్లను సమాధి చేసేవాళ్లు. ఈ సమాధులతోపాటు అనేక రకాల వరుసల్లో, చెల్లా చెదురుగా బంతిరాళ్లు (పెద్ద పరిమాణంలోని బండలు) ఉన్నాయి.

